www.nagaranijam.com

PRGI/RNI NO: APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NNTV TELANGANA నగర నిజం

సంపుటి : 14 | సంచిక :2 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 26 గురువారం, మార్చి 2026 | పేజీలు : 4+ | ₹ 3

Volume : 14 | Issue : 2 | Rangareddy | Editor : Yela.Purushotham | 26 Thursday , MARCH 2026 | Pages : 4 + | Price : 3/-

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# ఇరాన్ యుద్ధంతో శంషాబాద్‌లో మూతపడ్డ పెట్రోల్ బంకులు

## అర్ధరాత్రి నుండి మధ్యాహ్నం వరకు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు

- మధ్యాహ్నానికే పెట్రోల్, డీజిల్ అయిపోవడంతో బంకులు మూసివేసి డీలర్లు
- బంకుల మూసివేతతో అవస్థలు పడుతున్న వాహనదారులు



**రాజేంద్రనగర్, మార్చి 25 (నగరనిజం ప్రతినిధి):** ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందంటే ఇదే కాబోలు.... పశ్చిమాసియా దేశాల్లో కొనసాగుతున్న యుద్ధం ప్రభావంతో ముడి చమురు లేక రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో పెట్రోల్ బంకులన్నీ మూతపడ్డాయి. పెట్రోల్, డీజిల్ కొరతపై గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పుకార్లు షికార్లు చేయడంతో వాహనదారులంతా పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. సోమవారం అర్ధరాత్రి నుండి వాహనదారులంతా బంకులకు క్యూ కట్టారు. దీంతో శంషాబాద్ పట్టణంతో పాటు శంషాబాద్ మండలం లోని పలుచోట్ల ఎటు చూసినా బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం నరకయాతన పడ్డారు. ఇరాన్ తో ఇజ్రాయిల్, అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపై పడింది. ప్రధానంగా ముడిచమురు రవాణా నిలిచిపోవడంతో ఒకవైపు గ్యాస్ కొరత... మన వైపు పెట్రోల్, డీజిల్ కొరతతో జనం అల్లాడుతున్నారు. యుద్ధ ప్రభావంతో కేంద్ర పెట్రోలియం శాఖ ఇప్పటికే కమర్షియల్ సిలిండర్ల సరఫరాను నిలిపివేసింది. దీంతో శంషాబాద్ లోని హోటల్స్, హాస్టల్స్ అన్ని మూతపడ్డాయి. పలు హోటల్లో కట్టెల పొయ్యిలపై వంట చేస్తూ హోటలను తూతూ మంత్రంగా కొనసాగిస్తున్నాయి. మరోవైపు పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోవడంతో శంషాబాద్ తో పాటు మండలం లోని చాలాచోట్ల వాహనదారులు అవస్థలు పడ్డారు. పెట్రోల్, డీజిల్ కోసం సోమవారం అర్ధరాత్రి నుండి కిలోమీటర్ల మేర బారులు తీరారు. యుద్ధం ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియక వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం ఎగబడ్డారు. మరికొందరైతే ఇంటి వద్ద స్టాక్ పెట్టుకోవడానికి బంకుల వద్ద డబ్బాలు, క్యాన్లతో క్యూ కట్టారు. దీంతో పెట్రోల్ బంకుల వద్ద పోలీసు బందోబస్తు మధ్యన విక్రయాలు కొనసాగించారు. దీంతో మంగళవారం మధ్యాహ్నానికి పెట్రోల్ డీజిల్ అయిపోవడంతో బంకులన్నీ మూతపడ్డాయి. పెట్రోల్ బంకులు మూతపడడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు.





# పెట్రోల్, డీజిల్ సరఫరాపై వదంతులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 25 నగర నిజం :** వికారాబాద్ ?జిల్లాలో ఇంధన (పెట్రోల్, డీజిల్) కొరత ఉందంటూ సాగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్దకు చేరుకుని బారులు తీరవద్దని ఆమె సూచించారు. ఇలాంటి చర్యల వల్ల అనవసరమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు.?పెట్రోల్ లేదా డీజిల్ కొరత ఉందంటూ ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే, వారిని గుర్తించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు తమకు అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇంధనాన్ని నిల్వ చేయకూడదని కోరారు. ఎవరైనా అక్రమంగా నిల్వలు చేపడితే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలందరూ సంయమనం పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ తెలియజేశారు.

# కార్యకర్తలకు అండగా నిలబడతా

- డీసీసీ కార్యదర్శి శివయ్య గౌడ్
- ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు



**వలిగొండ మార్చి25( నగర నిజం)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సుంకిశాల గ్రామంలో కాంగ్రెస్ జిల్లా డీసీసీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్‌కు ఘన సన్మానం నిర్వహించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివయ్య గౌడ్, లక్ష్మి దంపతులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, శివయ్య గౌడ్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. శివయ్య గౌడ్ మాట్లాడుతూ, "నాతోటి కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలబడతాను" అని హామీ ఇచ్చారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి గారికి, అలాగే ఎంపీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షిక క్రీడా దినోత్సవం



**హయత్‌నగర్, మార్చి 25 (నగర నిజం):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో వార్షిక క్రీడా దినోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. 'కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. అనిత' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల 'ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు' అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రో కబడ్డీ లీగ్, ఖేలో ఇండియా, తెలంగాణ ప్రీమియర్ లీగ్‌లలో తొలి మహిళా వ్యాఖ్యాతగా గుర్తింపు పొందిన, "మైండ్ విత్ ప్లే" 'గ్రంథ రచయిత డాక్టర్ మాధవి బండారి' హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, వికాసానికి దోహదపడతాయని పేర్కొంటూ విద్యార్థుల్లో ప్రేరణ నింపారు. కళాశాల స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యూనివర్సిటీ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. 'ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. అనిత' మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొని ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి అవసరమైన శిక్షణను అందిస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# రేవంత్ రెడ్డికి దమ్ముంటే నాపై పోటీకి రావాలి

- హరీశ్ రావు సవాల్



**హైదరాబాద్, నగరనిజం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, ఆయన తల్లకిందులుగా తపస్సు చేసినా అది అసాధ్యమని ఎద్దేవా చేశారు. తమ పార్టీకి ఎప్పుడు, ఎలా గోల్ కొట్టాలో బాగా తెలుసని, సమయం వచ్చినప్పుడు బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే వేరే వాళ్లను పంపడం కాకుండా, నేరుగా సిద్దిపేటలో తనపై పోటీకి రావాలని బహిరంగ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు రైతులను కూడా దారుణంగా మోసం చేసిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్ సర్కారుపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు. ఇదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశాలపై స్పందిస్తూ, తాము ఈ మార్పులను స్వాగతిస్తున్నామని తెలిపారు. పునర్విభజన వల్ల భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీకే రాజకీయంగా మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, కుటుంబ నియంత్రణను పక్కాగా పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో, నిధుల్లో అన్యాయం జరగడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై హరీశ్ రావు ఆసక్తికరంగా స్పందించారు.

# ఎస్ఎఫ్ఐ ఛలో అసెంబ్లీ"పై పోలీసుల నిర్బంధం

- ఖండిస్తూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలు అపలేరు...
- విద్యారంగానికి నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రోళ్ల మహేష్
- కనీసం 15% కేటాయింపు చేస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**నగర నిజం మార్చి 25** సంగారెడ్డి జిల్లా విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఛలో అసెంబ్లీ" ముట్టడి కార్యక్రమంపై పోలీసులు అమానుషంగా వ్యవహరించి నిర్బంధం ప్రయోగించడం తీవ్రంగా ఖండనీయం. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పిడిగుద్దులు గుద్ది, బలవంతంగా అదుపులోకి తీసుకుని నగరంలోని పలు పోలీస్ స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న చర్యగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లు పూర్తిగా న్యాయసమ్మతమైనవని, వాటిని పరిష్కరించాల్సింది పోయి ఉద్యమాలపై అణచివేత విధానం అవలంబించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8500 కోట్ల స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 20 శాతం కేటాయింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాలలో సుమారు 70% అద్దె భవనాలలోనే నడుస్తున్నాయని, అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలకు తక్షణమే స్వంత భవనాలు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో ఏకపక్షంగా ఎన్ ఈ పి -2020 అమలు చేస్తామని ప్రకటించడాన్ని ఖండిస్తూ, రాష్ట్ర యూనివర్శిటీలలో ఎం ఈ పి 2020 అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు నాన్-టీచింగ్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ ఛార్జీలు పెంచినప్పటికీ, వాటికి సంబంధించిన బిల్లులు రెగ్యులర్‌గా విడుదల చేయడం లేదని, వసతిగృహ విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల కోసం అమలు చేస్తున్న "బెస్ట్ అవైలబుల్ స్కీం" కింద ఉన్న రూ. 218 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం-2020 అమలు కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఖమ్మం మరియు ఆదిలాబాద్ జిల్లా కేంద్రాలుగా జనరల్ యూనివర్శిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడులు చేసి ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే, రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

# ఇంధన కొరతపై అపోహలు

- ప్రజలు ఆందోళన చెందవద్దు
- పానిక్ బయ్యింగ్ వల్లే తాత్కాలిక ఇబ్బందులు
- పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్





**వలిగొండమార్చి 25:( నగర నిజం)** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారం అసత్యమని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళనతో పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లి అనవసరంగా ట్యాంకులు నింపుకోవడం వల్లే కొన్ని చోట్ల తాత్కాలికంగా స్టాక్ తగ్గుతున్నదని వెల్లడించింది. అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ పూర్తిగా సాధారణంగా కొనసాగుతోందని తెలిపారు. HPCL, IOCL, దీూజూ సంస్థల వద్ద తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పానిక్ బయ్యింగ్ కారణంగా పెట్రోల్, డీజిల్ విక్రయాలు సాధారణ స్థాయి కంటే 2.5 నుండి 3 రెట్లు పెరిగాయని తెలిపారు. దీనివల్ల కొంతమంది రిటైల్ అవుట్‌లెట్లలో తాత్కాలికంగా స్టాక్ అయిపోతున్నట్లు చెప్పారు. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం చట్టవిరుద్ధమని, ఇది తీవ్రమైన భద్రతా ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజలు అవసరమైనంత మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని, అనవసరంగా నిల్వ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్యాస్ (LPG) సరఫరా కూడా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని స్పష్టం చేశారు. తప్పుడు వార్తలను నమ్మవద్దని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అసోసియేషన్ ప్రజలను కోరింది.

# అక్రమ లేఅవుట్‌పై ఫిర్యాదు

- చర్యలు కోరిన గ్రామస్థులు



**మెదక్ బ్యూరో :నగర నిజం:** మనోహరాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 725లో ఎవీణూ మరియు గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ రోడ్లను ప్లాట్ల రోడ్లుగా చూపిస్తూ విక్రయానికి ప్రయత్నిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గౌరవ తహసిల్దార్, మనోహరాబాద్ గారికి అధికారికంగా ఫిర్యాదు అందజేశారు. అక్రమ లేఅవుట్ కారణంగా ప్రజలకు నష్టం కలగవచ్చని, వెంటనే విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నిర్మల కుమార్ గౌడ్, శ్రీశైలం యాదవ్, మాజీ వార్డు సభ్యుడు బండారి బాలేష్, బండి నరేందర్ గౌడ్, ప్రవీణ్ యాదవ్, నాగరాజు యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బ్రోకర్ల 'రాజ్యం

- గాలికి ఎగిరిన స్లాట్ విధానం
- కాసులకే అధికారుల ప్రాధాన్యత
- సామాన్యులకు తప్పని నిరీక్షణ
- పారదర్శకత కరువు

**నగర నిజం సంగారెడ్డి, మార్చి 25:** సంగారెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమల్లో ఉన్న 'స్లాట్ బుకింగ్' విధానం ఇక్కడ కేవలం కాగితాలకే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తుల (బ్రోకర్ల) హవా కొనసాగుతుండటంతో సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

## నిబంధనలు పక్కనపెట్టి..

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రభుత్వం స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, ఇక్కడ అధికారులు బ్రోకర్లు చెప్పినట్లుగానే నడుచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా నిర్ణయించిన సమయాలను పట్టించుకోకుండా, 'ముడుపులు' అందిన పనులకే అధికారులు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు



బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గంటల తరబడి నిరీక్షణ

దూర ప్రాంతాల నుండి వచ్చి, ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకున్న సామాన్యులకు కార్యాలయంలో చుక్కెదురవుతోంది. బ్రోకర్ల ద్వారా వచ్చే ఫైళ్లను వెనువెంటనే క్లియర్ చేస్తున్న అధికారులు, నిబంధనల ప్రకారం వచ్చే వారిని గంటల తరబడి వేచి చూసేలా చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయ ప్రాంగణం అంతా బ్రోకర్లు, వారి అనుచరులతో కిక్కిరిసిపోయి, అసలైన దరఖాస్తుదారులకు కనీసం




నిలబడే చోటు కూడా లేని పరిస్థితి నెలకొంది.

## ఉన్నతాధికారులు స్పందించాలి

కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించి స్లాట్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలి. కార్యాలయంలో మధ్యవర్తుల ప్రమేయాన్ని అరికట్టాలి. సామాన్య ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా పారదర్శకత తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలి

- ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి
- కాగజ్ ఘట్ గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన



**ఇబ్రహీంపట్నం, మార్చి 25 ( నగరనిజం ) :** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు సలగాలని ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం కాగజ్ ఘట్ గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. ఆ సీతారాముల ఆశీస్సులతో ప్రజలంతా సుఖ,సంతోషాలతో పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. సీతారాముల దీవెనలతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. సీతారాముల అనుగ్రహం అందరికీ లభించాలని కోరుకుంటున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా జరుపుకునే అచ్చమైన పండుగ శ్రీరామనవమని రాష్ట్రంలో తెలుగు వాకిళ్ళన్ని పండుగ శోభయామానంతో కలకలలాడుతూ అచ్చమైన తెలుగుదనం ఉట్టిపడేలా ఈ పండుగ అందరికీ శుభాలను చేకూర్చాలని, రైతులకు సకాలంలో పాడిపంటలు సమృద్ధిగా పండి ఆనందంగా రైతులు జీవించాలని ఆ సీతారాముల వారిని కోరినట్లు తెలిపారు. ఆ సీతారాముల విగ్రహ ప్రతిష్టాపనతో గ్రామానికి పూర్తి వైభవం రావాలని కోరారు. యావత్తు మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం అన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్థులు మర్రి నిరంజన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరి నేచర్స్ వ్యాలీ రిసార్ట్స్ నిర్వహకులు ముప్పాల నర్సరాజు, గ్రామ సర్పంచ్ బాకారం శిల్పా రెడ్డి, ఉపసర్పంచ్ మైలారం శ్రీనివాస్, నాయకులు కమలాకర్ రెడ్డి, భాషయ్య, బీజేపీ నాయకులు లచ్చిరెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉండకుంటే రద్దు చేస్తాం

- ఇంకా చాలామంది పట్టా సర్టిఫికెట్లు సైతం తీసుకోలేదు
- డబల్ బెడ్ రూమ్ కేటాయించిన కుటుంబాలు వెంటనే చేరాలి
- స్పష్టం చేసిన కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



**మహేశ్వరం మార్చి 25, (నగరనిజం) :** లబ్ధిదారులు డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉండకుంటే వారికి రద్దు చేసి కొత్తవారికి కేటాయిస్తామని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం మండల్ ఎమ్మార్వో చిన్నప్పల్నాయుడు తో కలిసి ఆయన మన్ సాన్ పల్లీ డబల్ బెడ్ రూమ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబల్ బెడ్ రూమ్ కేటాయించిన కుటుంబాలు ఇంతవరకు నివసించడం లేదన్నారు. పట్టా సర్టిఫికెట్లు తీసుకున్నప్పటికీ గృహప్రవేశాలు చేయలేదన్నారు. వారందరూ వెంటనే గృహప్రవేశాలు చేయాలని లేకుంటే రద్దు చేసి వేరే వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. డబల్ బెడ్ రూమ్ లో ఉంటున్న కుటుంబాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని ఆర్డిఓ తెలిపారు. ఏ కుటుంబానికి అయితే ఇల్లు కేటాయించారో అదే కుటుంబం ఆ ఇంట్లో ఉండాలన్నారు. కిరాయికి ఇవ్వడం అమ్ముకోవడం జరిగితే రద్దుచేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా చాలామంది పట్టా సర్టిఫికెట్లు సైతం తీసుకోలేదని వారికి రద్దుచేసి అర్హులైన వారికి ఇచ్చే ప్రక్రియ జరుపుతామని ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. మంఖాల్ డబుల్ బెడ్ రూమ్ లో జిహెచ్ఎంసి ఏఈ ఓ ఇంటి తాళం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కావున లబ్ధిదారులందరూ తమకు కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి వెంటనే చేరిపోవాలని ఆయన స్పష్టం చేశారు.



# మాతృదేవోభవ అనాధ ఆశ్రమంలో అనాధల మధ్య బడంగ్పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ సామ నరసింహ గౌడ్ జన్మదిన వేడుకలు





**నాదర్గుల్ డివిజన్ మార్చ్ 25 (నగర నిజం)** మహేశ్వరం నియోజకవర్గం శంషాబాద్ జోన్ బడంగ్పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్గు ల్లో మాతృదేవోభవ అనాధాశ్రమం లో అనాధల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్న బడంగ్పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ సామ నరసింహ గౌడ్ అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ మాతృదేవోభవ అనాధాశ్రమంలో మొదట గా నేనే అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించానని ఆయన అన్నారు. గత 12 సంవత్సరాలుగా నా జన్మదిన సందర్భంగా అనాధలకు నా వంతుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నానని నన్ను చూసి చాలామంది ఈ అనాధలకు అన్నదానం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈరోజు 60వ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా యాదగిరి గుట్టలో 200 మంది అనాధలకు నా దరిగురిలోని మాతృదేవో భవ అనాధ ఆశ్రమంలో అనాధలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నానని ఇదంతా ఆ లక్ష్మీనరసింహస్వామి కృప వల్ల నాకు తోచిన సహాయం చేస్తున్నానని ఆయన తెలిపారు. మానవత్వం కలిగిన ప్రతి ఒక్కరు ఈ అనాధలకు జన్మదినం, పెళ్లిరోజు ఇంకా ఏదైనా కార్యక్రమం సంబంధించిన రోజు అనాధలకు అన్నదానం చేస్తే ఎంతో మంచిదని ఆ దేవుడు వాళ్ళని చల్లగా చూస్తాడని ఆయన అన్నారు. కుటుంబాన్ని నడపలేని స్థితిలో చాలామంది ఇబ్బంది పడుతున్నారని అలాంటిదివి ఎంతో సాహసించి ఈ అనాధ ఆశ్రమాన్ని నడిపిస్తు అనాధలకు దేవుని ప్రతిరూపమైన గట్టు గిరికి నా అభినందనలు తెలియజేస్తున్నా ను. ఈ కార్యక్రమంలో సామ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నిజాయితీకి నిలువుటద్దం: వేములకొండ గ్రామ పంచాయతీ సిబ్బంది!

- నగదు పోయినా దొరుకుతుందేమో కానీ
- నమ్మకం దొరకడం అరుదు!
- పది తులాల వెండి పట్టీలు దొరికితే..

వెనుకాడకుండా బాధితులకు అందజేసిన సిబ్బంది.

- సిబ్బందులను అభినందించిన సర్పంచ్ ఏర్పుల

వెంకటేశం ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్

- వేములకొండ పంచాయతీ సిబ్బందిని

అభినందించిన గ్రామస్థులు.

**వలిగొండ మార్చి ( నగర నిజం)**నేటి స్వార్థపూరిత సమాజంలో ఇంకా మానవత్వం, నిజాయితీ బ్రతికే ఉన్నాయని వేములకొండ గ్రామ పంచాయతీ సిబ్బంది నిరూపించారు. విధి నిర్వహణలో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతుండగా, సిబ్బందికి సుమారు 10 తులాల వెండి పట్టీలు లభించాయి. వెంటనే స్పందించిన సిబ్బంది, ఆ వెండి పట్టీలు గ్రామానికి చెందిన బత్తుల నరసింహ



- ఇటెలమ్మ దంపతులకు చెందినవిగా గుర్తించారు. ఏమాత్రం ఆశ పడకుండా, సదరు బాధితులను పిలిపించి అందరి సమక్షంలో ఆ వెండి ఆభరణాలను వారికి భద్రంగా అందజేశారు. తమ కష్టార్జితాన్ని తిరిగి అప్పగించిన సిబ్బంది నిజాయితీని చూసి బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. "మా వస్తువు దొరుకుతుందని అస్సలు అనుకోలేదు, మీలాంటి మంచి మనసున్న వారు ఉండటం మా అదృష్టం" అంటూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్, కార్యదర్శి మరియు గ్రామ ప్రజలు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు."రూపాయి ఆశ చూపినా లొంగని నైజం.. ఎదుటివారి కష్టాన్ని చూసి తపించే గుణం.. ఇదే వేములకొండ పంచాయతీ సిబ్బంది చూపిన నిజాయితీ కి నిదర్శనం!"

# ఎండ వేడితో అల్లాడుతున్న జనం..

## శంషాబాద్ ఆర్టీసీ చౌరస్తా వద్ద ఉచిత మజ్జిగ కేంద్రాన్ని నెలకొల్పిన సామాజికవేత్త సిద్దు రెడ్డి

- చల్లని మజ్జిగతో గొంతు తడుపుతున్న కందగట్ల సిద్దు రెడ్డి
- చిన్ననాటి స్నేహితుడైన వికలాంగుడిచేత మజ్జిగ కేంద్రానికి రిబ్బన్ కట్ చేయించిన కందగట్ల
- కందకట్ల సిద్ధురెడ్డి సేవలపై ప్రశంసల జల్లు కురిపించిన సినీ నటుడు ఇంద్రసేన్





**రాజేంద్రనగర్, మార్చి 25 (నగరనిజం ప్రతినిధి):** వ్యాపారంలో డబ్బులు సంపాదిస్తే నాలుగు రాళ్ల వెనకేసుకోవాలని ఎవరైనా భావించడం పరిపాటి. కానీ సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజ సేవ కోసం ఉపయోగించేవారు చాలా అరుదుగా ఉంటారు. ఆ కోవకే చెందుతారు రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కు చెందిన సామాజికవేత్త కందకట్ల సిద్ధురెడ్డి. తల్లి కందకట్ల బుచ్చమ్మ రెక్కల కష్టంతో పడుతూ.... లేస్తూ సర్కారు బడిలో చదివి ఉన్నత స్థితికి చేరుకున్న కందకట్ల సిద్దు రెడ్డి.... నిరంతరం సామాజిక సేవ కోసం పరితపిస్తున్నారు. సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజ సేవ కోసం వినియోగిస్తూ ఆనంద సాగరంలో మునిగితేలుతున్నారు. సర్కారు బడిలో చదివి ప్రయోజకుడైన సిద్దు రెడ్డి.... సొంత ఖర్చులతో ప్రభుత్వ బడులను తీర్చిదిద్దడం హాబీగా మార్చుకున్నారు. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే.నాణానికి మరోవైపు తొంగి చూస్తే నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల ద్వారా దారి చూపడం.... కష్టాల్లో ఉన్న ప్రజలకు చేయూతనందించడం కనిపిస్తుంది. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి సిద్దు రెడ్డి ముందుకు వచ్చారు. వరుసగా ఐదవ ఏడాది కూడా శంషాబాద్ వద్ద ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మనసారా తృప్తిగా చల్లని మజ్జిగ తాగండి.... చల్లని దీవెనలు మాకు అందించండి అనే ట్యాగ్ లైన్ తో నెలకొల్పిన మజ్జిగ కేంద్రాన్ని తన చిన్ననాటి స్నేహితుడైన ఒక వికలాంగుడిచేత రిబ్బన్ కట్ చేయించి ప్రారంభింపజేశారు. పల్లె వాతావరణం తలపించేలా గుడిసె సెట్టింగ్ లో ఈ చల్లని మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు సిద్దు రెడ్డి.తల్లి కందకట్ల బుచ్చమ్మ తో పాటు ప్రాణ స్నేహితులైన సినీ నటుడు ఇంద్రసేన్, పల్లె బాలేశ్వర్ తో కలిసి ఈ కార్యక్రమానికి బుధవారం నాడు శ్రీకారం చుట్టారు సామాజికవేత్త సిద్దు రెడ్డి. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి.... వరుసగా అయిదవ ఏడాది వేసవికాలంలో చల్లని మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వేసవికాలంలో ప్రజలు దాహంతో అల్లాడుతుంటారని, అలాంటి వారి కోసం ఖర్చుకు వెనుకాడకుండా చల్లని మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శంషాబాద్ కు చెందిన యువతీ యువకులతో పాటు ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు ఉద్యోగులు, బాటసారులు ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని సిద్దు రెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్ననాటి తన స్నేహితుడైన అంగ వికలాంగుడిచేత ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభింపజేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన తల్లి కందకట్ల బుచ్చమ్మ ఆశీస్సులతో తాను వ్యాపార రంగంలో రాణిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించడం ఆనందంగా ఉందన్నారు కందకట్ల సిద్ధురెడ్డి. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను చూసి ఏ ఒక్కరు మారినా సరే తన జీవితం ధన్యమైనట్లేనని సిద్దు రెడ్డి అభిప్రాయపడ్డారు.

### సిద్దు రెడ్డి సేవా కార్యక్రమాలపై సినీ నటుడు ఇంద్రసేన్ ప్రశంసల జల్లు

సమాజంలోని ప్రతి ఒక్కరూ స్వార్థంతో జీవిస్తున్న ఈ రోజుల్లో సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజ సేవ కోసం వినియోగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న కందకట్ల సిద్దు రెడ్డి పై ప్రముఖ సినీ నటుడు ఇంద్రసేన్ ప్రశంసల జల్లు కురిపించారు. సిద్దు రెడ్డి తమకు స్నేహితుడు కావడం గర్వంగా ఉందని ప్రకటించారు. సిద్దు రెడ్డి లాగా సమాజంలోని ప్రతి ఒక్కరు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఇంద్రసేన్ పిలుపునిచ్చారు. వేసవి కాలానికి ముందే శంషాబాద్ వద్ద ఉచిత మజ్జిగ కేంద్రాన్ని నెలకొల్పి రెండు నెలల పాటు దానిని కొనసాగించడం మామూలు విషయం కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, యువ నేత కొడిగంటి ప్రశాంత్ రెడ్డి, పల్లె బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.








# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- కుర్మపల్లి గ్రామ ఉపసర్పంచ్ పుప్పాల శ్రీశైలం
- విద్యార్థులు చదువుతో పాటు కళా,సాంస్కృతిక రంగాల్లో ఎదగాలి




**రంగారెడ్డి ప్రతినిధి, మార్చి 25 ( నగరనిజం ) :** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కుర్మపల్లి గ్రామ ఉప సర్పంచ్ ముప్పాల శ్రీశైలం అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి సర్పంచ్ కట్ట మహేష్, ఉపసర్పంచ్ ముప్పాల శ్రీశైలం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నారాయణ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ముప్పాల శ్రీశైలం మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు కళా,సాంస్కృతిక రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే విద్యపై దృష్టి పెట్టలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని కోరారు. ఇష్టపడి చదివి తమ తల్లిదండ్రుకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నారాయణ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'రైటర్ల' వీరంగం






- అద్దాలు ధ్వంసం!
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**నగర నిజం మార్చి 25** సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా డాక్యుమెంట్ రైటర్లు బరితెగించారు. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ప్రభుత్వ కార్యాలయంలో ఇద్దరు రైటర్లు సామాన్యుల సాక్షిగా వీరంగం సృష్టించారు. ఒకరిపై ఒకరు దాడికి దిగడమే కాకుండా, కార్యాలయ ఆస్తులను ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది.విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం రిజిస్ట్రేషన్ పనుల విషయంలో ఇద్దరు డాక్యుమెంట్ రైటర్ల మధ్య మాట మాట పెరిగింది. పాత కక్షలు లేదా డాక్యుమెంట్ల క్లియరెన్స్ విషయంలో వచ్చిన విభేదాలతో ఇద్దరూ కార్యాలయంలోనే వాగ్వాదానికి దిగారు. గొడవ ముదరడంతో ఆగ్రహానికి గురైన ఒకరు కార్యాలయ మెయిన్ రూమ్ అద్దాల తలుపును బలంగా నెట్టడంతో అది ముక్కలైంది.కళ్లముందే ప్రభుత్వ ఆస్తి ధ్వంసమవుతున్నా, సామాన్య ప్రజలు భయాందోళనకు గురవుతున్నా అధికారులు మాత్రం కనీసం అడ్డుకొనే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. గొడవ పడుతున్న వారిని మందలించాల్సింది పోయి, అధికారులు మౌనంగా ఉండిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంపై పట్టు కోల్పోయిన అధికారులు, రైటర్ల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయంలో అల్లరి సృష్టించిన రైటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి..ధ్వంసమైన ఆస్తికి వారి నుంచే పరిహారం వసూలు చేయాలి.కార్యాలయంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా పోలీసులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలనీ ప్రజలు కోరుతున్నారు.

# 40 ఏళ్ల అనుబంధానికి స్వస్తి..

- రేవంత్ పై ధ్వజమెత్తుతూ కాంగ్రెస్ కు జీవన్ రెడ్డి రాజీనామా

**హైదరాబాద్, నగరనిజం:**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. జగిత్యాలలో కార్యకర్తల సమక్షంలో తన రాజీనామా లేఖను విడుదల చేసిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ హైకమాండ్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నానని, గౌరవం లేని చోట ఉండలేకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయనకు ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# డంపింగ్ యార్డ్ ను తండాల మధ్యలో వెయ్యొద్దు

- డంపింగ్ యార్డ్ వద్దంటూ ఎమ్మార్వోకు వినతిపత్రం



**మహేశ్వరం మార్చి 25, (నగరనిజం) :** ఉప్పుగడ్డ తండా, కావలోనిబాయి తండా వాసులు తమ ప్రాంత అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ దిశగా ముందడుగు వేశారు. ఈ రెండు తండాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు జరుగుతుందనే ఊహాగానాల నేపథ్యంలో, భవిష్యత్తులో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి మహేశ్వరం ఎమ్మార్వో చిన్నపలనాయుడుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల పర్యావరణ కాలుష్యం, దుర్వాసనలు, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుని, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులను కోరారు. వినతిపత్రాన్ని సానుకూలంగా స్వీకరించి, ప్రజల ఆందోళనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం పాండు నాయక్, వైస్ ప్రెసిడెంట్ మోతిలాల్ నాయక్, జనరల్ సెక్రటరీ భరత్ కుమార్ ,ఎం దేవేందర్ నాయక్ ,గుండ్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# విడతలవారీగా గ్రామాన్ని అభివృద్ధి పరుస్తాం

## సీసీ రోడ్లు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్



**మహేశ్వరం మార్చి 25, (నగరనిజం) :** విడతలవారీగా గ్రామపంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని పులిమామిడి గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్ పేర్కొన్నారు. బుధవారం కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఒకటి, రెండు, మూడు, వార్డుల్లో సీసీ రోడ్డ పనులను వార్డు సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు రోడ్లు నిత్యజీవితంలో ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని వర్షాకాలంలో ఎదురయ్య ఇబ్బందులను తగ్గిస్తాయని ఆయన తెలిపారు. గ్రామం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్టేనన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాపగల రాములు ,వార్డు సభ్యులు బట్టు అంజనేయులు పాప గళ్ళ మహేష్, జాల ప్రవీణ్, అనేగొని రవి, గంగవరం మల్లేష్, యువ నాయకులు రేవెల్లే సాయి, బట్టు మల్లేష్ అల్వాల అశోక్ తదితరులు పాల్గొన్నారు

# 10 నెలల పసికందుకు అరుదైన శాస్త్ర చికిత్స




**ఖమ్మం: (నగర నిజం బ్యూరో) మార్చి 25:** ఖమ్మం ప్రాంతానికి చెందిన 10 నెలల బాబు ఎముక మజ్జ వైఫల్యంతో బాధపడుతున్న తరుణంలో ఆ బాబు తల్లిదండ్రులు హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ ను సంప్రదించంగా అక్కడ వైద్య బృందం అరుదైన శాస్త్ర చికిత్స అందించి వైద్యులు అత్యాధునిక హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ మార్పిడి చేసి కొత్త జీవితాన్ని అందించారని ఖమ్మం యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ విక్రమ్ కుమార్ వెల్లడించారు . ఇది వారసత్వంగా వచ్చే అమెగాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే అరుదైన ఎముక మజ్జ వ్యాధి . గతేడాది డిసెంబర్ 26న సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తీసుకొచ్చారు . సమగ్ర క్లినికల్ పరీక్షల అనంతరం అమె గాకార్యోసైటిక్ థ్రోంబోసైటోపెనియా ఉన్నట్లు మరియు ప్లేట్లెట్స్ కౌంట్ తక్కువగా ఉండటాన్ని గుర్తించారు . శస్త్రచికిత్స పూర్తిచేసుకున్న చిన్నారితో వైద్య బృందం నిర్ధారణ అయిందని ఇది తీవ్రమైన థ్రోంబోసైటోపె నియా , రక్తస్రావం , ప్రమాదంతో కూడిన అరుదైన వారసత్వంగా వచ్చే ఎముక మజ్జ వైఫల్య రుగ్మతగా గుర్తించి తండ్రి మూల కణాలను ఉపయోగించి హాప్లోయిడెంటికల్ స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్ జనవరి 8న విజయవంతంగా నిర్వహించారు . బాబు వైద్యపరంగా స్థిరంగా ఉన్నాడని నిర్ధారించుకున్న తరువాత డిశ్చార్జ్ చేశామని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో వీటీ. శ్రీధర్ రావు , బాల కృష్ణ , నాగార్జున పాల్గొన్నారు .

# గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



**మహేశ్వరం మార్చి 25,(నగరనిజం). :** మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని మహిళా (60) మృతదేహం లభించిందని మహేశ్వరం ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. మహేశ్వరంలో ఉన్నటువంటి కోనేటి లో ఒక వృద్ధ మహిళ మృతదేహం ఉందని సమాచారం తెలవడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతురాలి ఒంటిపై రెండు చేతులకు పచ్చబొట్లు, బంగారు రంగు గాజులు ఉన్నాయని మెడలో ఎరుపు రంగు పూసల గొలుసు ధరించి ఉందని తెలిపారు, సమాచారం తెలిసిన వ్యక్తులు మహేశ్వరం పోలీస్ స్టేషన్లో 8712662368, సంప్రదించాలని ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

## చిట్కుల్ లో శాస్త్రోక్తంగా శ్రీ సీత రామ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- ముగిసిన ద్వదినాత్మక ప్రతిష్ఠాపన క్రతువులు..
- భక్తులకు దర్శనం ఇచ్చిన సీతా రాములు..
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు, కాలనీ వాసులు, భక్తులు..





**నగర నిజం మార్చి25** సంగారెడ్డి జిల్లా ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో నిర్మించిన శ్రీ హనుమ సమేత సీతా రామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నులపండువగా ముగిసింది.గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా, బుధవారం తెల్లవారుజాము నుండే వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9:43 గంటలకు మృగశిర నక్షత్ర యుక్త వృషభ లగ్న సుముహూర్తాన స్వామి వారి యంత్ర స్థాపన, బింబ స్థాపన, శిఖర స్థాపన ఘట్టాలను అత్యంత వైభవంగా పూర్తి చేశారు. అనంతరం మూర్తులకు ప్రాణ ప్రతిష్ఠ గావించి, నేత్రోన్మీలనము నిర్వహించారు. ఆలయ నిర్మాణంతో పాటు కాలనీలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు నీలం మధు ముదిరాజ్ తీసుకున్న ఈ చొరవను కాలనీ వాసులు కొనియాడుతున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మూర్తులకు ప్రత్యేక కళా కుంభాభిషేకము, శ్రీ సీతారామ స్వామి దేవతా అర్చనలు నిర్వహించారు. మహానివేదన, మంగళ నీరాజనాల అనంతరం భక్తులకు రక్షాధారణ, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామనామ స్మరణతో చిట్కుల్ పుర వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, భక్తులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయం అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి






- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం: (నగర నిజం బ్యూరో )మార్చ్ 25,**మారుతున్న సాంకేతికత కు అనుగుణంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో పెట్టాలినూతన భవనం, ప్రహరీగోడ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి ఖమ్మం నగరం బస్ డిపో రోడ్ లోని డిస్ట్రిక్ లైబ్రరీ లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్జిల్లా గ్రంథాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, పాఠకులకు, విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.బుధవారం స్థానిక బస్ డిపో రోడ్ లోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైబ్రరీ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనం, చుట్టూ ప్రహరీగోడ, టాయిలెట్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. నిర్మితమవుతున్న నూతన రెండు అంతస్థుల భవనంతో పాటు విద్యార్థులకు, అభ్యర్థులు, పాఠకులకు కావాల్సిన వసతుల ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుసంధానంగా ప్రహరీ గోడ, గేట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రంథాలయంలోని రీడింగ్ రూమ్ లలో తిరుగుతూ కావాల్సిన వసతుల అవసరాలను కలెక్టర్ గుర్తించారు. అక్కడ ఉన్న పాఠకులతో, పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులతో జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. ఏ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలి, ఏమైనా అవసరాలు కావాలా వివరాలు అందిస్తే పది రోజుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికన లైబ్రరీ అదనపు భవనం, నిర్మాణ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. అభ్యర్థులు, విద్యార్థులకు అనువైన అధునిక వసతులతో చేపట్టిన నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించి ప్రతి సంవత్సరం అప్ డేట్ అయిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు పాతవి మార్చాలని, పాఠకులు యువకులతో చర్చించి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు ప్రతి విభాగం వారీగా అవసరమైన పుస్తకాల జాబితాను తయారు చేసి వెంటనే అందించాలని కలెక్టర్ గ్రంథాలయ నిర్వాహకులకు సూచించారు. గ్రంథాలయంలో వివిధ రకాలైన పుస్తకాలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేసేందుకు దోహదపడుతాయని అన్నారు. కొత్త రకం ఛాలెంజ్ తో ప్రాక్టికల్ లర్నింగ్ ద్వారా ఆలోచన శక్తి పెంపొందించి పోటీ పరీక్షలకు ఉపయోగపడుతాయని తెలిపారు. లైబ్రరీ లోని పలు వార్తాపత్రికలు, సాహిత్యంతో విజ్ఞానాన్ని పొందవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా విద్యార్థులు, యువత గ్రంథాలయాల సేవలను ఉపయోగించుకుని తమ భవిష్యత్తును గమ్యాలను చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు, యువత విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా, అదే సమయాన్ని గ్రంథాలయంలో గడపడం ద్వారా కొత్త కొత్త విషయాలు, విజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది భాస్కర్ రావు, అఖిల్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా క్షేత్రంలో చెరగని ముద్ర

## మాజీ మావోయిస్టు నేత సాంబశివుడు 15వ వర్ధంతి ప్రత్యేక కథనం




**వలిగొండ మార్చి 25( నగర నిజం )** బడుగు, బలహీన వర్గాల గొంతుకగా, సాయుధ పోరాట యోధుడిగా, తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన పాత్ర పోషించిన కోనపురి సాంబశివుడు భౌతికంగా దూరమై అప్పుడే 15 ఏళ్లు గడిచిపోయాయి. రేపు (మార్చి 26) ఆయన 15వ వర్ధంతి సందర్భంగా సాంబశివుడి సొంత గ్రామమైన దాసిరెడ్డిగూడెంలో ఆయన అనుచరులు, అభిమానులు ఘన నివాళులు అర్పించేందుకు సిద్ధమవుతున్నారు.సామాన్య కుటుంబం నుంచి సాయుధ పోరాటం వైపు..యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సాంబశివుడు (అసలు పేరు కోనపురి ఐలయ్య), చిన్నతనం నుంచే సమాజంలోని అసమానతలపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 1990వ దశకంలో పీపుల్స్ వార్ (ప్రస్తుత మావోయిస్టు పార్టీ) సిద్ధాంతాలకు ఆకర్షితుడై అడవి బాట పట్టారు.నక్సలైట్ ఉద్యమంలో కీలక బాధ్యతలు:దాదాపు రెండు దశాబ్దాల పాటు అజ్ఞాతంలో గడిపిన సాంబశివుడు, మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు.నల్లమల అడవుల రారాజు: ఒకప్పుడు నల్లమల రీజియన్‌లో మావోయిస్టు పార్టీకి వెన్నెముకగా నిలిచారు.రాష్ట్ర కార్యదర్శిగా: సీపీఐ (మావోయిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి, పార్టీ వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్నారు.ప్రధాన దాడుల్లో పాత్ర: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జరిగిన అలిపిరి దాడి వంటి సంచలనాత్మక ఘటనల్లో ఈయన పేరు ప్రముఖంగా వినిపించింది.జనజీవన స్రవంతిలోకి.. (లొంగుబాటు):తీవ్ర అనారోగ్య సమస్యలు (ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఇతర శారీరక ఇబ్బందులు) మరియు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, 2009 ఫిబ్రవరి 16న సాంబశివుడు అప్పటి హోం మంత్రి జానారెడ్డి సమక్షంలో పోలీసులకు లొంగిపోయారు. ఆయుధాన్ని వీడినా, తన ఆశయాలను మాత్రం వీడలేదు.

### తెలంగాణ ఉద్యమం - రాజకీయ ప్రస్థానం:

లొంగిపోయిన తర్వాత సాంబశివుడు తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత BRS) లో చేరారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు పార్టీలో చేరి, పొలిట్ బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. దూమ్-ధామ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు.

### ఘోర హత్య - ఒక శకం ముగింపు:

మార్చి 26, 2011 రాత్రి వలిగొండ మండలం సంగెం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమం ముగించుకొని వెళ్తుండగా, గోకారం సమీపంలో గ్యాంగ్‌స్టర్ నయీం అనుచరులు సాంబశివుడిని అత్యంత కిరాతకంగా నరికి చంపారు. ఆ ఘటన ఉమ్మడి నల్గొండ జిల్లాను దిగ్భ్రాంతికి గురిచేసింది.

### నేటికీ నిలిచిన జ్ఞాపకం

"నేను నక్సలైట్‌ను కాదు.. తెలంగాణవాదిని" అని గర్వంగా ప్రకటించిన సాంబశివుడు, అమాయక ప్రజల పక్షాన నిలబడతానన్న తన మాటను నిలబెట్టుకున్నారు. ఆయన 15వ వర్ధంతి వేళ, దాసిరెడ్డిగూడెంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన చేసిన ప్రజా పోరాటాలను గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు.

## రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై అసెంబ్లీలో గందరగోళం

**హైదరాబాద్, నగరనిజం:**బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో గందరగోళం నెలకొంది. భాజపా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పపువ్వు సారా అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. సారా పథకానికి మాత్రం ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యా నించారు. ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా.. మరేదైనా పేరు పెట్టుకోవాలని అన్నారు. దీన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. దివంగత మహిళా ప్రధానిని భాజపా ఎమ్మెల్యే అవమానించారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భాజపా నేతలు ఇందిరమ్మ మీద ఇంకా అక్కసు ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇంది రాను అవమానించడమంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీని వాజ్‌పేయీ ఉక్కు మహిళ, దుర్గా మాతా అని గతంలో అన్నారని గుర్తుచేశారు.

# పెద్ద షాపూర్‌ను అన్ని రంగాల్లో ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతా





- సర్పంచ్ దేవులపల్లి సునీత సత్యనారాయణ గౌడ్
- 10 లక్షలతో తలపెట్టిన డ్వాక్రా భవనానికి శంకుస్థాపన చేసిన సునీత సత్యనారాయణ గౌడ్
- సొంత ఖర్చులతో రెండు వార్డులలో బోర్లు వేయించిన సర్పంచ్

**రాజేంద్రనగర్, మార్చి 25(నగరనిజం ప్రతినిధి):** పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ పెద్ద షాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో.... ఉప సర్పంచ్ నందు ముదిరాజ్ తో పాటు గ్రామపంచాయతీ సభ్యుల సమిష్టి కృషితో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని సునీత సత్యనారాయణ గౌడ్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని పెద్ద షాపూర్ వద్ద 10 లక్షల వ్యయం తో తలపెట్టిన డ్వాక్రా గ్రూప్ వివో2 భవన నిర్మాణం పనులకు బుధవారంనాడు సర్పంచ్ దేవులపల్లి సునీత సత్యనారాయణ గౌడ్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెద్ద షాపూర్ లోని 7,8 వార్డులలో నిర్మించిన నూతన రోడ్లను సర్పంచ్ ప్రారంభించారు. మరోవైపు వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని పెద్ద షాపూర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ను సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు.

### సొంత ఖర్చులతో బోరు వేయించిన సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్

ప్రస్తుత వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి పెద్ద షాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 6వ వార్డులో సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ సొంత ఖర్చులతో బోరు వేయించారు. గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి 6వ వార్డులో బోరు వేయిస్తున్నట్లు సునీత సత్యనారాయణ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్.... స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహాయ సహకారాలతో పెద్ద షాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఉపసర్పంచ్ నందు ముదిరాజ్ తో పాటు గ్రామపంచాయతీ వార్డు సభ్యుల సమిష్టి కృషితో పెద్ద షాపూర్ గ్రామాన్ని ఆదర్శనీయంగా తీర్చిదిద్దుతామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పెద్ద షాపూర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సునీత సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందు ముదిరాజ్, పంచాయతీ వార్డు సభ్యులు ఎల్గని కృష్ణవేణి కిషోర్ గౌడ్, జిల్లా అంబిక శ్రీనివాస్ ముదిరాజ్, బత్తుల నిర్మల హనుమంతు యాదవ్, కేశంపేట చంద్రకాంత్ యాదవ్, గండి పరమేశ్వరి పవన్ పటేల్, పూర్ణం కుమార్, కొమ్మ గళ్ళ ఆనంద్, కొమ్మ గళ్ళ సుమలత మల్లేష్, కేశంపేట నవీన్ ముదిరాజ్, ఆవుల శాంతమ్మ యాదయ్య, పెండ్లి మడుగు బాలకృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ మహమ్మద్ గౌస్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.



Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE